# మసక మసక నీడలు

'రోగం మనిషిని బాధించనంతకాలం కొంతవరకు తట్టుకోవచ్చేమో. మనస్సుని బాధించడం మొదలుపెడితే తట్టుకోవటం చాలా కష్టం. ఈ రోగం తగ్గుతుందో తగ్గదోగాని కొన్ని నమ్మకాల్ని మట్టుకు నాశనం చేస్తూంది. ఇదివరకు ఎవరేనా ఆకుపసరులు, మూలికలు మింగుతూంటే చిరాకుపడేవాణ్ణి, , ఇంతమంది



డాక్టర్లు ఉండగా ఏమిటీ పిచ్చి అని.

'ఒంట్లో ఓపిక లేకపోయినా మనస్సు సమ్మతించక పోయినా ఏదో మినుకు మినుకుమనే ఆశ లాక్కువచ్చింది పల్లెటూరికి. అరుదుగా వచ్చే బస్సుల కోసం నిరీక్షణ, కుదుపులు. . . నాలుగు మైళ్ళ నడక. . . తనురాలేదూ ఇంతదూరం? ఎవరేనా చూస్తే ఇది పిచ్చి అనుకోరూ?'

అయిన్నమైనా, అనుభవం పునశ్చరణ చేసుకోగానే

— వి. రాజారామమోహనరావు

గానంతా పాడు చేశావు.'' ఆయన చెయ్యి గాలిలో విసురుగా ఊగింది.

వాడి కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. కందిన బుగ్గ చేత్తో రాసుకుంటూ అలాగే నిలబడ్డాడు.

నా మనస్సు చివుక్కుమంది పావ కళ్ళల్లో నీళ్ళు. . .వాణ్ణి చూస్తూ ఉండిపోయింది.

''ఏడవకు పాపా, అమ్మ గాను మారుస్తుందిలే.''

ఊలోగా కౌంటరు ముందున్న అతను పరిగెత్తుకు వచ్చాడు. వాడు చూడలేక చూడలేక బెరుగ్గా తలెత్తాడు. కందిన బుగ్గమీదనించి నీళ్ళు జారి, పడుతున్నాయి మాసిన నిక్కరు మీదికి. చెడామడా తిట్టటం మొదలు పెట్టాడు కౌంటరు ముందతను.

పాప వాణ్ణే చూస్తూంది. ఆ చిన్నారిబుగ్గలమీద ఒకటి రెండు కన్నీటిచుక్కలు జారిపోయాయి.

''రామ్మా'' అంటూ తీసుకు పోయాడాయన.

పాప వెనక్కి తిరిగి . . . తిరిగి . . . వాణ్ణే చూస్తూ వెళ్ళిపోయింది.

కింద పడిన ప్లేటు తీసికొని లోపలికి వెళ్ళి పోయాడు వాడు.

వాతావరణాన్ని భరించలేక బస్సు వస్తే బాగుండునని పించింది.

హోటలులోనించి బయటికి వెళ్ళిపోవాలనిపించింది. కాని వెళ్ళలేకపోయాను. కారణం గురించి ఆలోచించ కుండా అలాగే సిగరెట్టు కాలుస్తూ కూర్చుండి పోయాను.

ఏవేవో బస్సులు వస్తున్నాయి పోతున్నాయి. కాని నేను వెళ్ళవలసింది మట్టుకు రాలేదు. ఎవరెవరో వస్తున్నారు వెడుతున్నారు.

వాడు మళ్ళీ వచ్చి గ్లాసులు, ప్లేట్లు తీస్తున్నాడు. కందిన బుగ్గమీద కన్నీటిచారిక, ఉబ్బినకళ్ళు. మామూలుగానే ప్లేట్లు తీస్తున్నాడు. ఇదివరకుకన్నా జాగ్రత్తగా, ప్లేటు చెయ్యి జారకుండా. . .

అనాలోచితంగానే నా చిన్ననాటి జీవితం గుర్తు వస్తూంది. బలవంతంగా మనస్సు తిప్పుకున్నాను, పలగని పువ్వులా గడిచిన నా బాల్యాన్ని వాడితో పోల్చుకోలేక.

''చిన్నతనం తిరిగివస్తే ఎంత బాగుండును.'' చాలామంది ఎప్పుడో ఒకప్పుడు కోరుకుంటారు

చీపురు తీసుకువస్తున్నాడు మళ్ళీ. చూడాలనిపించ లేదు. పిరికితనం. ముఖం తిప్పుకున్నాను ఇంకోవైపు.

కాలుమీద తట్టాడు తీయమన్నట్టు. ఉలిక్కి పడ్డాను ఆ స్పర్శకి. తల వంచుకుని ఊడుస్తున్నాడు.

''ఒరేరంగా, మీనాన్న వచ్చాడు ఇటురా.'' పిలిచాడు కౌంటరు ముందతను.

చీపురు మూల పెట్టి కౌంటరు దగ్గిరకి వెళ్ళాడు.

''ఇదిగో నీ జీతం పదిహేను రూపాయలు, మీ అయ్యకిస్తున్నాను'' అన్నాడు డబ్బు రంగడి నాన్న కిస్తూ.

డబ్బు తీసుకొని వెళుతున్నానన్నట్టు చూశాడతను. కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

''ఓ పావలా ఇవ్వు నాన్నా.'' తలవంచుకొనే నసిగాడు రంగడు.

''ఎడిశావులే ఎందుకు పావలా?''

రంగడు తల ఎత్తలేదు.

తూలుతూ వెళ్ళిపోయాడు రంగడి తండ్రి.

బరువుగా కాళ్ళు ఈడ్చుకొంటూ వెనక్కి వచ్చేసి చీపురు తీసుకున్నాడు.

ఆ చిన్నారి మనస్సులో ఏ కోరిక ఉందో, మళ్ళీ మామూలే. వాడు. . . ఎంగిలిప్లేట్లూ. . .కేకలూ . . ఊడవటం. . . .

నిత్యం అన్ని అవసరాలూ ఏ మాత్రం శ్రమపడ కుండా గడిచేవాళ్ళు, వెధవ గానుగ బ్రతుకనుకోవడం ఎన్నోసార్లు విన్నాను.

ఎంత బీద సంసారమైతే మటుకు వాడు సంపాదించు కున్న దాంట్లో ఓ పావలా ఇస్తే ఏం పోతుందో? . . . ఏమో వాళ్ళ పరిస్థితులేమిటో? . . .

కుతూహలం మనిషిని అనవసర విషయాలు కూడా తెలుసుకునేలా చేస్తుంది. బిల్లు ఇస్తూ అతన్ని అడగ కుండా ఉండలేకపోయాను.

''వచ్చింది రంగడి నాన్నేనా?''

ఔనన్నట్టు తల ఊపాడు.

''వాళ్ళ సంసారం బాగా పెద్దదా? గడవటం అంత కష్టమా?''

రెండుక్షణాలు అయోమయంగా చూసి నవ్వాడతను.

''భలేవారండీ . . . మీరేదో చాలా ఊహాగానం చేసినట్టున్నారు రంగడి సంసారం గురించి. రంగడు అడిగిన పావలా లక్ష్మయ్య ఇవ్వనందుకేనా?''

ఔనన్నట్టు తల ఊపాను.

''అది మామూలేనండి. ప్రతీనెలా లక్ష్మయ్యవచ్చి ఇలా తీసుకువెళుతూంటాడు. రంగడు ప్రతీసారీ అడగ టం. . .వాడి తీరు మామూలుగా....వాడంతే. . . .''

''మరి? . . .''

''ఉండండి చెబుతా. మీరనుకున్నట్టు పెద్ద సంసారమేమి కాదు. మూడేళ్ళక్రితం రంగడి తల్లి పోయింది. అంతకుముందు వీణ్ణి ఎలా చూశారోగాని ఇప్పుడుమటుకు జరుగుతున్న విధానం ఇది. పెళ్ళాం పోయిన ఏడాదికి భద్రమ్మని చేరదీశాడు లక్ష్మయ్య. రంగడు కూడా ఇంచుమించుగా అదే సమయంలో నా దగ్గిర చేరాడు. చేరిన రెండునెలలు ఇంటి దగ్గిర ఉన్నాడేమో. తరవాతనించి ఇక్కడే. ఇక్కడే భోం చేస్తాడు. ఏదో ఒక బల్లమీద పడుకొని నిద్రపోతాడు. లక్ష్మయ్య అప్పుడప్పుడు అడుగుతాడు ఇంటికి రమ్మని. కాని రంగడు ఏనాడూ వెళ్ళలేదు.''

''రంగడికి అక్క, చెల్లెళ్ళు ఎవరూ లేరా?''

''ఎవరూ లేరండి. ఒక్కడే సంతానం. లక్ష్మయ్య, భార్యపోయిన తరవాత మరీ ఇదిగా తయారయ్యాడు. ఏ పనీ తిన్నగా చెయ్యడు. సంపాదించినరోజు సంపా దిస్తాడు. లేనివాడు లేదు. రోజూ తాగుడు. అస్తమానూ అటూ ఇటూ తిరుగుతాడు. రంగడి పరిస్థితి చూస్తే మరీ బాధగా ఉంటుంది. ఎంతమంది చెప్పినా ఇంటికి వెళ్ళడు. వాడి మనసు ఏం చెదిరిందో? ఒంటరిగా ఇక్కడే ఉంటాడు. అప్పుడప్పుడు చూసీ చూడకుండా నేనేదో చిల్లర ఇస్తూంటాను. ప్రతి ఆదివారం తప్పనిసరిగా ఓ పావలా ఇస్తాను. ఎంత ఇచ్చినా జీతం రోజున లక్ష్మయ్యని అడగటం మానడు. వాడు ఇవ్వడు. 'ఇవ్వనివాణ్ణి అడగటం ఎందుకురా? నేను అడుగు నేను ఇస్తాను' అన్నాను రెండు మూడుసార్లు.''

''ఇస్తారండీ... కాని నాన్నచేతో ఎప్పుడైనా? . . .''

ఇంక వినాలనిపించలేదు. మాట మార్చాలని



విష్ణుమూర్తి

ఫోటో—ఎస్. షా అలీ (హైదరాబాద్)

''లక్ష్మయ్యకి మీరు చెప్పి చూడకపోయారా?'' అన్నాను.

''నేనేమిటండీ చనువు ఉన్నవాళ్ళం అందరం చెప్పాం. 'ఏమిటే పాడు అలవాట్లు మానేయమని.' 'కుర్రాణ్ణి చేరదీసి జాగ్రత్తగా చూసుకోమని.' కాని వింటేనా? ఎవరడిగినా ఒక్కటే సమాధానం. 'నా చేతుల్లో ఏం లేదండీ వాడికంతే రాసిఉంది. ఈ అలవాట్లు నే మాన లేను. మాని బ్రతికే ఓపికా లేదు.''

''బ్రతికి వాణ్ణే నువ్వు ఉద్ధరించిందేమిటి?'' అని అడిగాను ఒకసారి కోపంపట్టలేక.

''ఏం ఉద్ధరించాను బాబూ. ఏంలేదు తండ్రి అనే శవం ఒకటి ఉందనే ధైర్యం తప్ప.'' అన్నాడు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ, ఆరోజు రోజూకన్న ఎక్కువ తాగి ఓ అరుగుమీద స్పృహ లేకుండా పడిపోయాడు.''

బస్సు వచ్చింది. హడావిడిగా జనం ఎక్కుతున్నారు. రంగడు కనిపిస్తాడేమోనని చూశాను. ''ఏమైనా డబ్బిస్తే ...'' నా ఆలోచనకు నాకే నవ్వు వచ్చింది. హోటలు యజమాని ఇచ్చే ఎంతో, నేనిచ్చినా అంతే. . . ఆలోచిస్తే నే నివ్వటం ఇంకా తక్కువేనేమో!

బస్సులో సీటులేదు. ప్రతిమాలగా కండక్టరు కొంతమందిని నిలబడనిచ్చాడు. బస్సులో అందరం ఒకటే. కాని కొందరికి నిర్ణీతంగా సీటు. . .కొందరు నిలబడటం.

జీవితం అంతే. నేడు మనం అనుభవించేదాని అర్హత ఏ కొలమానం ప్రకారం నిర్ణయించబడిందో, రేపు అనుభవించబోయేది దేనిమీద ఆధారపడుతుందో. ప్రస్తుతం మన కళ్ళముందు జరిగేవాటిని ఆలో చించి అవగాహన చేసుకోలేనప్పుడు ఏనాటిదో. . . ఎక్కడిదో ఆలోచనేం అందుతుంది?

ఒకసారి అప్పుడే గుర్తు వచ్చింది.

''ఎక్కడినుండి వచ్చితిమో, ఎక్కడికి పోగలమో కానా?

యెవ్వరికిక్క మేరింగి చెప్పుటకు వచ్చిన వారలుగారు.''

ఎవరం చెప్పలేక పోవచ్చు. కాని ఆలోచించలేకుండా ఉండలేం.

ఎలా జీవిస్తే శాంతి ఉంటుంది? ఏం చేస్తే

జీవితంలో విలువయింది మిగుల్చుకున్నామన్న తృప్తి మిగులుతుంది?

పరిష్కారాలు దొరక్కుండా ఉక్కిరి బిక్కిరి చేసే ఊహాలు ఇంకొకళ్లతో చెప్పుకోలేం. మనలో దాచుకోలేం. . .

అనుభవాల్ని మరుగున వెయ్యటం కాలానికున్న అద్భుతశక్తి. ఏడేళ్ల తరవాత మళ్లీ కడుపునొప్పి. మళ్లీ అదే పల్లెటూరి వైద్యుడిమీద నమ్మకం.

ఓపికగా వచ్చినందుకు ఫలితం దక్కలేదు. ఆనాడు నాటు వైద్యం చేసిన అతనింటికి అడగ్గానే దారి చూపించారు. కాని ఈనాడు రెండుగంటలు అచూకీ తియ్యవలసి వచ్చింది అతని చావువార్త వినటానికి.

'ఎటువంటి మనిషైనా గతించిన తరవాత. . .'.

మళ్లీ అదే కోవకి చెందిన ఆలోచన. . . .

ఊరు కొద్దిగా అభివృద్ధి అయింది. బస్సుస్టాండు దగ్గిర ఐదారు హోటళ్లు. ఎదురుగా అదే హోటలు.

ఆనాటి సంఘటన. . . .రంగడు. . .పాప. . . లక్ష్మయ్య. . .ఒక్కొక్కటే గుర్తు వచ్చాయి. గబగబా వెళ్లాను హోటల్లోకి. కౌంటరు ముందతనే ఉన్నాడు.

"రండి. . ." గుర్తుపట్టి తీసుకువెళ్లి కూర్చోపెట్టాడు. నా కళ్లు వెతుకుతున్నాయి. ఎవరో మురికి వాడు వచ్చి ఎంగిలిప్లేట్లు తీస్తున్నాడు. హోటలంతా కలయజూశాను.

కుతూహలం ఆగలేదు.

"రంగడు. . ."

ఒక్కక్షణం అదోలా చూశాడు అతను.

"గుర్తు వచ్చిందండీ మిమ్మల్ని చూసిన గుర్తుగాని, నిజంగా మీరెవరో గుర్తులేదు. రంగడంటే గుర్తు వచ్చింది."

"ఏడండీ రంగడు? . . ." లోపలికి చూస్తూ ఆత్రంగా అడిగాను.

"అప్పే లేడండీ వాడు వెళ్లిపోయి రెండేళ్లయింది."

"ఎక్కడికి?"

"ఏమోనండీ, రెండేళ్లక్రితం లక్ష్మయ్య ఎవ్వరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. వాడు వెళ్లిన రెండు నెలలకు రంగడు వెళ్లిపోతున్నానని చెప్పి వెళ్లిపోయాడు. ఎక్కడికిరా అంటే ఏం సమాధానం చెప్పలేదు. మొండిగా పట్టుపట్టి వెళ్లిపోయాడు. వాడి తరవాత ఈ ముసిలాడు చేరాడు."

వృద్ధుడు పక్కటేబిలు మీద ఖాళీగ్లాసులు తీస్తున్నాడు.

రంగడు ఎక్కడికి వెళ్లాడో? లక్ష్మయ్య వెళ్లినందుకే వెళ్లిపోయాడా? ఏమో? . .ఎక్కడున్నాడో? ఏం చేస్తున్నాడో? . . .

వాడి బాల్యమంతా అలా నిర్లిప్తంగా . .బరువుగా. . . గడిచింది. వాడి మిగిలిన జీవితం? . .

తాత చీపురు తెస్తున్నాడు. వణికేచేతులతో. . . తడబడే అడుగులతో. . .

ఈ వయస్సులో. . .ఈ ముసలితనంలో. . . .

నేనెక్కిన బస్సు కదిలింది. వెనకాల అద్దంలోంచి దుమ్ములో హోటలు గుమ్మం దగ్గిర తాత. . .మసకమసకగా కనిపిస్తున్నాడు.

అంతే! అన్నీ అసంపూర్ణమయిన మసకమసకలే!

★



మద్రాసు లైట్‌హౌస్

ఫోటో:—ఎస్. పాండురంగయ్య (సూర్యాపేట)